పచ్చిరొట్టతో పొలాలు సారవంతం

- చౌడు భూములకు మరింత ప్రయోజనం
- ఆరోగ్యవంతమైన దిగుబడులకు అవకాశం


వెదిరేశ్వరం జానకమ్మ రావి సమీపంలో సాగు చేస్తున్న జనుము పచ్చిరొట్ట ఎరువు


పచ్చిరొట్ట ఎరువుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

రావులపాలెం: పచ్చిరొట్ట ఎరువు అధిక దిగుబడులకు అండగా నిలుస్తుంది. అడ్డూఅదుపూ లేకుండా వినియోగిస్తున్న రసాయన ఎరువులు, పురుగు మందులతో నిస్సారమైపోతున్న పంట పొలాలను కాపాడుకునేందుకు పచ్చిరొట్ట సాగు చక్కని అవకాశం. ప్రస్తుతం ఆరోగ్యవంతమైన అధిక దిగుబడులు సాధించాలన్నా, భవిష్యత్ తరాలకు సారవంతమైన భూములు అందించాలన్నా పచ్చిరొట్ట వినియోగం ఎంతో మేలైంది. రైతులు ఖరీఫ్ సాగుకు ముందు పచ్చిరొట్ట ఎరువు సాగు చేస్తే ఆ తరువాత పండించే పంటలకు ఆరోగ్యవంతమైన దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. రైతులు పచ్చిరొట్ట ఎరువులపై అవగాహన పెంచుకొని మేలైన దిగుబడి సాధించాలని సూచిస్తున్నారు.

25,034 ఎకరాల్లో...

కొత్తపేట వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్‌లో 25,034 ఎకరాల్లో వరి సాగు చేయనున్నారు. ఆలమూరు మండలంలో 9 వేల ఎకరాలు, ఆత్రేయపురం మండలంలో 4,494 ఎకరాలు, రావులపాలెం మండలంలో 4,728 ఎకరాలు, కొత్తపేట మండలంలో 6,812 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తారని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. ఎకరానికి 12 కేజీల చొప్పున పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకుంటే మంచి ఫలితాలు వస్తాయని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

20 రోజుల ముందు

ఖరీఫ్ సాగుకు ముందు రెండు పర్యాయాలు దున్నిన పంట పొలంలో నేల స్వభావాన్ని బట్టి పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాల్లో ఏదోకటి చల్లుకోవాలి. విత్తనాలు చల్లిన 20 నుంచి 25 రోజుల్లో పచ్చిరొట్ట ఏపుగా ఎదుగుతుంది. మొక్కదశలో లేతగా ఉన్నప్పుడు మొక్కల మొదళ్ల వద్ద కత్తిరించి భూమిలో కలియ దున్నాలి. దుక్కు చేసేటప్పుడు 100 కిలోల సూపర్ పాస్ఫేట్ వేస్తే పచ్చిరొట్ట బాగా కుళ్లి నేలకు భారీగా సారాన్ని అందిస్తుంది. ఈ పచ్చిరొట్ట ముఖ్యంగా చౌడు నేలలకు మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. చౌడు భూముల్లో పచ్చిరొట్ట వేయడం ద్వారా భూమిలో గుల్లతనం పోయి సేంద్రియ పోషకాలు పుష్కలంగా భూమికి అందుతాయి. పచ్చిరొట్ట ఎరువులో నత్రజని శాతం అధికంగా ఉండడంతో రైతు సాగులో నత్రజని వినియోగించాల్సిన అవసరం ఉండదు.

ఆరోగ్యవంతమైన అధిక దిగుబడి

సాగులో గ్రీన్ మెన్యూర్ వినియోగంతో ఆరోగ్యవంతమైన అధిక దిగుబడులు సాధించవచ్చు. పచ్చిరొట్ట ఎరువు వినియోగించి పండించిన పంటపై ఎటువంటి దుష్ప్రభావం పడకపోవడం, భూమి సారవంతం కావడంతో సాధారణం కంటే అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుంది. పచ్చిరొట్ట వినియోగించిన పంట దిగుబడులతో ప్రజలకు ఆరోగ్య సమస్యలుండవు.

ఆర్ఎస్‌కేల ద్వారా అవగాహన

రాష్ట్ర ప్రభుత్వం సేంద్రియ సాగును ప్రోత్సహిస్తోంది. అందుకు అనుగుణంగా ఇప్పటికే వ్యవసాయాధికారులు రైతు సేవా కేంద్రాల్లో రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి పచ్చిరొట్ట ఎరువుపై అవగాహన కల్పిస్తున్నారు. పచ్చిరొట్ట ఎరువు సాగు, కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు. భూములు నిస్సారమైపోయి రానురానూ దిగుబడులు తగ్గిపోతున్న తరుణంలో పచ్చిరొట్ట వినియోగంతో పాటు సేంద్రియ సాగు వైపు అడుగులేయాలని రైతులకు సూచిస్తున్నారు.

పచ్చిరొట్టతో అధిక ప్రయోజనాలు



పచ్చిరొట్ట ఎరువులతో రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. నేల స్వభావాన్ని బట్టి జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాల్లో ఏదొక రకం ఎంచుకొని సాగుకు 20 రోజుల ముందు విత్తుకోవాలి. ముఖ్యంగా సరైన దిగుబడులు రాని చౌడు భూములకు పచ్చిరొట్ట ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. పచ్చిరొట్ట ఎరువుల ద్వారా పంటపై రసాయన ఎరువుల ప్రభావం తగ్గి భూమి సారవంతమై ఆరోగ్యవంతమైన ఉత్పత్తులు వస్తాయి.

–బి.మీనా, ఏవో, రావులపాలెం

'వెన్నుపోటు దినం'తో కళ్లు తెరిపిద్దాం

- జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జగ్గిరెడ్డి
- పోస్టర్ ఆవిష్కరణ


మలికిపురంలో వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా పార్టీ అధ్యక్షుడు జగ్గిరెడ్డి, మాజీ మంత్రి సూర్యారావు


పాశర్లపూడి సమావేశంలో మాట్లాడుతున్న పి.గన్నవరం కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

మలికిపురం: అధికార దాహంలో ఉండి ప్రజా సమస్యలను, హామీలకు గాలికి వదిలేసి ప్రజలకు వెన్నుపోటు పొడిచిన కూటమి ప్రభుత్వ చర్యలకు నిరసనగా ఈ నెల 4న నియోజక వర్గాల్లో వైఎస్సార్ సీపీ నిర్వహిస్తున్న వెన్నుపోటు దినం కార్యక్రమం ద్వారా ప్రభుత్వం కళ్లు తెరిపించేందుకు ప్రతి కార్యకర్త కూడా సిద్ధంగా ఉండాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి పేర్కొన్నారు. మలికిపురం పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సూపర్ సిక్స్ అంటూ ప్రజలను మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చి ఏడాది అయినా నేటి వరకూ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం జిల్లాతో పోలిస్తే రాజోలు నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలను ఉత్సాహంగా నడిపిస్తూ పార్టీని బలోపేతం చేస్తున్న మాజీ మంత్రి సూర్యారావును స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. నియోజక వర్గంలో పార్టీ కార్యకర్తలకు వెన్నుదన్నుగా ఉంటూ గ్రామగ్రామానా పర్యటిస్తున్నారని అన్నారు. సమావేశంలో మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు మాట్లాడుతూ నియోజకవర్గంలో అందరినీ సమన్వయపరుస్తూ ముందుకు సాగుతున్నామని, కష్టపడిన ప్రతి కార్యకర్తకు ప్రాధాన్యతతో కూడిన పదవులు ఇస్తూ మాజీ సీఎం జగన్ గౌరవిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు బల్ల ప్రసన్నకుమారి, కుసుమ వనజకుమారి, ఎంపీపీ మేరా మల్లిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, కుసుమ చంద్రశేఖర్, అడబాల వీర బ్రహ్మజీరావు, బొలిశెట్టి భగవాన్, నాయకులు కేఎస్ఎన్ రాజు, జంపన బుజ్జిరాజు, రుద్రరాజు చిన్నరాజా తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ విధానాలను ఎండగడదాం

మామిడికుదురు: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం వెన్నుపోటు దినం పేరిట నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నామని వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గం కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు తెలిపారు. పాశర్లపూడిలో సోమవారం మాజీ సర్పంచ్ మొల్లేటి త్రిమూర్తులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కో–ఆర్డినేటర్ మాట్లాడారు. ఈ నెల 4వ తేదీ బుధవారం పార్టీ శ్రేణులు, ప్రజలు చలో పి.గన్నవరం కార్యక్రమానికి తరలి రావాలన్నారు. పి.గన్నవరం సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రజల్ని మోసం చేసిన కూటమి ప్రభుత్వ విధానాలను ఎండగట్టడమే వెన్నుపోటు దినం లక్ష్యమన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు చేపట్టే ఈ నిరసన ద్వారా ప్రభుత్వం కళ్లు తెరిపిస్తామన్నారు. ప్రభుత్వ అసమర్థతపై ప్రజా వ్యతిరేకతను ప్రతిధ్వనింప చేస్తామని చెప్పారు. ఎన్నికలకు ముందు మాయమాటలతో ప్రజల్ని మభ్యపెట్టారని శ్రీనివాసరావు తీవ్రంగా ధ్వజమెత్తారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొరిరెడ్డి అంజిబాబు, పార్టీ నేతలు తోరం భాస్కర్, నెల్లి దుర్గాప్రసాద్, చిక్కం బుజ్జిబాబు, పొలమూరి గోపాల్, తులా గోపాలకృష్ణ, జోగి రామకృష్ణ, కడలి శ్రీను, కుసుమ శ్రీను, గెద్దం ఏసుదాసు, మట్టపర్తి శివ తదితరులు పాల్గొన్నారు.

ఆత్రేయపురంలో..

కొత్తపేట: కూటమి ప్రభుత్వం వంచన పాలనకు నిరసనగా ఈనెల 4న వైఎస్సార్ సీపీ నిర్వహించతలపెట్టిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు, ప్రజలు విజయవంతం చేయాలని జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఆత్రేయపురంలో మండల పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు కనుమూరి శ్రీనివాసరాజు అధ్యక్షత జరిగిన సమావేశంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వెన్నుపోటు దినం కార్యక్రమం విజయవంతానికి సమావేశంలో చర్చించారు. కూటమి వంచనపై ప్రజల గొంతుకగా వారి పక్షాన ఉద్యమించాలని నిర్ణయించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు బోనం సాయిబాబు, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి కప్పల శ్రీధర్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ చిలువూరి రామకృష్ణంరాజు, కొల్లి శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నివారణ మాసోత్సవాలు

సఖినేటిపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల ఒకటో తేదీ నుంచి నెలాఖరు మలేరియా నివారణకు ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అవగాహన సదస్సులు నిర్వహిస్తారని డా. పి.జయగాయత్రి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక పీహెచ్‌సీ వద్ద జరిగిన ర్యాలీలో మలేరియా వ్యాధిపై ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేశారు. అనాఫిలిస్ దోమ కాటు ద్వారా మలేరియా వ్యాధి సంక్రమిస్తుందని జ్వరం వచ్చిన వారినుండి రక్తపూతలు సేకరించి పీహెచ్‌సీ వద్ద ల్యాబ్ పరీక్ష ద్వారా వ్యాధి నిర్ధారణ చేస్తారని తెలియజేశారు. ఇంటి చుట్టూ నీరు నిల్వలేకుండా చూసుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రై డే ఫ్రై డే కార్యక్రమం పాటించాలని తెలియజేశారు. కార్యక్రమంలో డా.సి.దుర్గా కావ్య, హెల్త్ సూపర్‌వైజర్స్ పీఎల్ఎన్ స్వామి, పి.సరస్వతి, సిబ్బంది బాలశంకర్, కరుణకుమార్ హెల్త్ అసిస్టెంట్లు, పీహెచ్‌సీ సిబ్బంది, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సీహెచ్‌వోలు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: చలి, వణుకుతో కూడిన జ్వరం అనాఫిలిస్ దోమల ద్వారా వ్యాప్తి చెందుతుందని అంబాజీపేట పీహెచ్‌సీ వైద్యాధికారి కేఎన్ శ్రీనివాస్ తెలిపారు. మలేరియా మాసోత్సవంలో భాగంగా సోమవారం అంబాజీపేటలో ర్యాలీ నిర్వహించారు. రక్తపరీక్ష, ఆర్‌డీ టెస్ట్ ద్వారా మలేరియాను నిర్ధారించవచ్చన్నారు. దోమలు కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ బి.అప్పారావు, పీహెచ్ఎన్ భూలక్ష్మి, హెచ్‌వీ శాంతకుమారి, ఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో నాణ్యమైన దిగుబడులు


అవిడి సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త రాజశేఖర్

కొత్తపేట: వ్యవసాయ, ఉద్యాన పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించడం ద్వారా అధనపు ఆదాయం పొందాలని తూర్పుగోదావరి జిల్లా కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం, జాతీయ వాణిజ్య పంటల పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని అవిడి రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ, ఉద్యాన పంటల సాగులో మెళకువలు, యాంత్రీకరణ, సాంకేతికత, డ్రోన్ వినియోగం, కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహకాలు తదితర అంశాలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి పి.పద్మలత ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు వ్యవసాయ శాఖ స్థానిక సబ్ డివిజన్ ఏడీ ఎం.వెంకటరామారావు అధ్యక్షత వహించగా డీఆర్‌సీ ఏడీలు రాజశేఖర్, మనోహర్‌కృష్ణ, ఐసీఏఆర్ శాస్త్రవేత్తలు డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ లక్ష్మీపతి, సంజయ్ హెగ్డే, అజ్మల్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ సాగు భూముల్లో భూసార పరీక్షలు ఎంతో అవసరమన్నారు. ఫలితాల ఆధారంగా నీరు, ఎరువులు, పురుగుమందుల వినియోగం ద్వారా నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే వివిధ పథకాల గురించి వివరిస్తూ పంటల సాగులో సాంకేతికతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. యాంత్రీకరణ విధానం ద్వారా ఖర్చులు తగ్గాయన్నారు. ప్రస్తుతం డ్రోన్ల వినియోగంతో ఇంకా ముందుకు వెళ్లి మరిన్ని ప్రయోజనాలు, సమయం ఆదా అవుతుందన్నారు. ప్రధానమంత్రి మైక్రోఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ ప్రైజెస్ పథకం గురించి అవగాహన కల్పించారు. సదస్సులో సర్పంచ్ రెడ్డి చంటి, ఎంపీటీసీ సభ్యుడు దూళి సూరిబాబు, ఎరువుల డీలర్లు సూరవరపు రామకృష్ణ, అయిరెడ్డి రామారావు, రైతులు పాల్గొన్నారు.

బాలాజీని దర్శించుకున్న ఎమ్మెల్యే

మామిడికుదురు: కృష్ణా జిల్లా గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సోమవారం కుటుంబ సమేతంగా అప్పనపల్లి బాలబాలాజీ స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతుడైన బాలబాలాజీ స్వామిని దర్శించుకున్నారు. అర్చకుల నుంచి వేద ఆశీర్వచనం అందుకున్నారు. అర్చకులు శేషవస్త్రంతో ఎమ్మెల్యేను సన్మానించారు. ఆలయ పర్యవేక్షకుడు సత్యమూర్తి ఎమ్మెల్యే వెంకట్రావుకు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు


గుడిమెళ్లంకలో విజేతలకు బహుమతులు అందిస్తున్న కార్యదర్శి సునీత

మలికిపురం: యోగాంధ్రప్రదేశ్ అవగాహనలో భాగంగా మలికిపురం ఎంపీడీఓ కార్యాలయంతో పాటు గుడిమెళ్లంక పంచాయితీ వద్ద సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మలికిపురం మండల పరిషత్ కార్యాలయం వద్ద ముగ్గుల పోటీలు ఎంపీడీవో ఎ.మల్లికార్జున రావు, సూపరింటెండెంట్ జి.మిల్టన్, ఐసీడీఎస్ సూపర్వైజర్ కె.హైమవతి, మలికిపురం పంచాయతీ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. గుడిమెళ్లంక పంచాయతీ వద్ద ముగ్గుల పోటీలు జరిగాయి.. సర్పంచ్ నల్లి విజయకుమారి, కార్యదర్శి డీఎల్ సునీత, ఎంపీటీసీ నల్లి అంజలిదేవి తదితరులు పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు.

ఉయ్యూరివారి మెరకలో..

సఖినేటిపల్లి: యోగా డే పురస్కరించుకుని ఉయ్యూరి వారి మెరక పంచాయతీ వద్ద సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. సర్పంచ్ ఓగూరి రత్నకుమారి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న చిన్నారులకు బహుమతులు అందజేశారు. యోగాపై అవగాహన కల్పించేందుకు మహిళలను, చిన్నారులను ప్రోత్సహిస్తున్నామని సర్పంచ్ రత్నకుమారి అన్నారు.

ఆలమూరు: మండలంలోని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో నిర్వహించిన ముత్యాల రంగవల్లుల పోటీలు విశేషంగా ఆకట్టుకున్నాయి. యోగాంధ్ర సాధనలో భాగంగా మండల కేంద్రమైన ఆలమూరులోలోని ఎస్సీ ఏరియాల్లో నిర్వహించిన ఈ పోటీలను సర్పంచ్ నేలపూడి లావణ్య ప్రారంభించారు. అందులో పాల్గొని చక్కని ప్రతిభను కనబర్చిన 19 మంది కిశోర బాలికలకు బహుమతులను అందజేశారు. అలాగే పెనికేరులో కూడా రంగవల్లుల పోటీలు జరిగాయి.


ఆలమూరులో రంగవల్లులను తిలకిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

విద్యార్థులకు రుచిగా, శుచిగా భోజనం అందించాలి


కొత్తపేటలో కుక్ అండ్ హెల్పర్ల శిక్షణలో మాట్లాడుతున్న ఎంఈఓ లీలావతి

కొత్తపేట: ప్రభుత్వ పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన బడి పథకం కింద విద్యార్థులకు రుచిగా, శుచిగా భోజనం అందించాలని ఎంఈఓ–2 కె.లీలావతి పథకం నిర్వాహకులకు సూచించారు. సోమవారం స్థానిక జిల్లా ప్రజా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మండలంలోని 83 పాఠశాలకు సంబంధించి కుక్ అండ్ హెల్పర్‌లకు ఎంఈఓ లీలావతి అధ్యక్షతన ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వంట శాలలు, వంట పాత్రలు ఎప్పుడూ శుభ్రంగా ఉండాలన్నారు. నాణ్యమైన సరుకులతో శుచిగా రుచిగా వండి పాఠశాల విద్యార్థులకు భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎన్.సత్యనారాయణ, ఎస్ఎఫ్ఓ పి.శ్రీనివాస్, అవిడి పీహెచ్‌సీ ఎంపీహెచ్‌పీ వాడ సద్గుణరావు, ఎంఎల్‌హెచ్‌పీ వీడీ లక్ష్మి, ఆర్పీలు కె.విజయకుమారి, వి.భవాని తదితరులు పాల్గొన్నారు.

యోగా ఏర్పాట్లపై పరిశీలన

సఖినేటిపల్లి: యోగాంధ్ర క్యాంపెయిన్‌లో భాగంగా మంగళవారం ప్రముఖ పర్యాటక ఏరియా అంతర్వేది బీచ్లో 3 వేల మంది ప్రజలతో యోగా మెగా ఈవెంట్‌ను నిర్వహిస్తున్నట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి అన్నారు. సోమవారం ఈ మేరకు అంతర్వేది బీచ్లో ఆర్డీవో కె.మాధవితో కలసి ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను జేసీ పరిశీలన చేశారు. వెంట డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పంట కాలువలను సిద్ధం చేయండి


లాకుల వద్ద పనులు పరిశీలిస్తున్న గుబ్బల శ్రీనివాస్

సఖినేటిపల్లి: నియోజకవర్గంలో పంట కాలువను వెంటనే పూడిక తీసి సార్వా సాగుకు సిద్ధం చేయాలని గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్ట్ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని సఖినేటిపల్లిలో సఖినేటిపల్లి లాకు పూడికతీత పనులు పరిశీలించిన ఆయన మాట్లాడుతూ లాకు గేటు వద్ద, అలాగే నియోజకవర్గంలోని అన్ని కాలువల డ్యాముల వద్ద పేరుకుపోయిన వ్యర్థాలను త్వరగా తొలగించాలని నీటి సంఘం అధ్యక్షుడు నామన నాగభూషణానికి సూచించారు. కాలువల్లో పూడికతీత పనులు త్వరగా పూర్తి చేయించి రాబోయే ఖరీఫ్ పంటకి సఖినేటిపల్లి మండలంలో రైతులు అత్యధికంగా నాట్లు వేసే విధంగా కృషి చేస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో రాజోలు నీటి సంఘం వైస్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ ఆకన బాబ్జి నాయుడు, సఖినేటిపల్లి నీటి సంఘం అధ్యక్షుడు నామన నాగభూషణం, పాటబళ్ళ సూరిబాబు, నామన సూరినారాయణ, మామిడిశెట్టి నాగరాజు, నామన గోపాలం తదితరులు పాల్గొన్నారు.

బీసీ చైతన్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సూర్యచంద్రరావు


నియామక పత్రం స్వీకరిస్తున్న సూర్యచంద్రరావు

కొత్తపేట: బీసీ చైతన్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మట్టపర్తి సూర్యచంద్రరావు నియమితులయ్యారు. ఆ మేరకు తన నియామకాన్ని ఆయన సోమవారం కొత్తపేటలో విలేకరులకు తెలిపారు. విజయవాడ గాంధీనగర్ ప్రెస్‌క్లబ్ వేదికగా జాతీయ బీసీ చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం 139 బీసీ కుల సంఘాల ప్రతినిధులతో భారీ సమావేశం నిర్వహించినట్టు ఆయన తెలిపారు. సమావేశంలో జాతీయ అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ నియామకం జరిగిందన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తన నియామక పత్రాన్ని శ్రీనివాస్ చేతుల మీదుగా అందుకున్నానని తెలిపారు. జిల్లా నుంచి తనను గుర్తించి కమిటీలో నియమించినందుకు జాతీయ, రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

అంతర్వేదిలో జేసీ ప్రత్యేక పూజలు


జేసీ నిశాంతిని ఆశీర్వదిస్తున్న అర్చకులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి వారి సన్నిధిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా జేసీ నిశాంతి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన జేసీకి అర్చకులు స్వాగతం పలికారు. దర్శన అనంతరం ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆమెను వేదమంత్రాలతో ఆశీర్వదించి ప్రసాదాలు అందజేశారు.

చిరంజీవినీకుమారి మృతి తీరని లోటు


చిరంజీవినీ కుమారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న సమతా నేతలు

ఆలమూరు: ఐడియల్ కళాశాలల అధినేత, ప్రముఖ రచయిత్రి డాక్టర్ పి.చిరంజీవినీ కుమారి మృతి సాహిత్య లోకానికి తీరని లోటని ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి వి.శ్యామ్ అన్నారు. స్థానిక సమత స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో సోమవారం ఆమె సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి కె.రామకృష్ణ అధ్యక్షత వహించగా ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి శ్యామ్ పాల్గొని ప్రసంగించారు. విద్య, సాహిత్య, రాజకీయ రంగాల్లో సుదీర్ఘకాలం అలుపెరగని పోరాటం చేసిన చిరంజీవినీ కుమారి బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. ఆమెకు సమత స్వచ్ఛంద సేవా సంస్థతో ఉన్న అనుబంధం విడలేనిదన్నారు. కాకినాడలో ఆమె స్థాపించిన నడిపించిన కళాశాలలో చదువుకుని ఎంతో మంది ఉన్నత స్థానానికి వెళ్లిన సంగతిని ఆయన గుర్తు చేశారు. అనంతరం సాహితీవేత్త చిరంజీవినీ కుమారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.రవికుమార్, మేనేజర్ రాము, అకౌంటెంట్ సురేష్, ఫీల్డ్ ఆర్గనైజర్స్ సహవాసరావ్, వరలక్ష్మి, నాగమణి, సుహాసిని, రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఉప్పునీటితో చౌడుబారుతున్న పొలాలు

మామిడికుదురు: ఓఎన్జీసీ వల్ల పాశర్లపూడిబాడవలో కొబ్బరితోటలు, పంట పొలాలు పాడైపోతున్నాయని మురుగు కాలువను బాగు చేసి కొబ్బరి తోటలకు నష్ట పరిహారం అందించాలని కోరుతూ రైతులు సోమవారం అమలాపురంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. దీంతో పాటు మామిడికుదురు మండల రెవెన్యూ కార్యాలయంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ శరణ్యకు కూడా విజ్ఞాపన పత్రం అందజేశారు. ఓఎన్జీసీ నిర్మించిన రోడ్ల వల్ల పంట పొలాలు, కొబ్బరి తోటలు ముంపుబారిన పడుతున్నాయని వాపోయారు. మురుగు కాల్వపై ఉన్న రెండు డ్యామ్‌లు నిరుపయోగంగా మారాయన్నారు. గోదావరి పోటు సమయంలో మురుగు కాలువ ద్వారా ఉప్పు నీరు పొలాల్లోకి ప్రవేశిస్తోందన్నారు. వాడబోది మురుగు కాలువను బాగు చేయించాలని కోరారు. భవిష్యత్తులో కొబ్బరి తోటలకు, వరి చేలకు నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వరి పంట పండించుకునే వెసులుబాటు కల్పించాలని, కొబ్బరి తోటలు చౌడు బారిపోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రైతులు తోరం నాగేంద్ర, పెదమల్లు వెంకన్నబాబు, వేగి లక్ష్మీనారాయణ, కట్టా ప్రసాద్, మోకా రంగారావు, చవటపల్లి నాగు, మేడిది నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ప్రిన్సిపాల్‌గా రామరాజు



మలికిపురం: స్థానిక ఏఎఫ్‌డీటీ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఆర్‌వీ రామరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ముప్పర్తి బాబులు ఉద్యోగ విరమణ చేయడంతో ఈయన బాధ్యతలు చేపట్టారు. కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ మంగెన వెంకట సత్యనారాయణమూర్తి, సభ్యులు డాక్టర్ రుద్రరాజు పద్మరాజు, జాన శంకరరావు, స్టాఫ్ సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. గత 33 ఏళ్ల నుంచి ఎకనామిక్స్ లెక్చరర్‌గా ఇదే కాలేజీలో పనిచేస్తున్నారు. బాధ్యతలు స్వీకరించిన రామరాజు మాట్లాడుతూ అందరి సహకారంతో జూనియర్ కాలేజీని అభివృద్ధి పథంలో నడిపిస్తానని అన్నారు.

కంప్యూటర్ల బహూకరణ

అల్లవరం: మండలం విద్యావనరుల కేంద్రానికి కొమరగిరిపట్నానికి చెందిన మోసుగంటి గంగయ్య మెమోరియల్ ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు కంప్యూటర్‌ను బహూకరించారు. ఎంఈవోలు కె.కిరణ్ బాబు, ఎస్.ఏడుకొండలుకు ట్రస్ట్ అధ్యక్షుడు మోసుగంటి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కుసుమ రమేష్ బాబు చేతుల మీదుగా సోమవారం వాటిని అందించారు. కార్యక్రమంలో ఎస్టీయూ అల్లవరం మండలం అధ్యక్షుడు గురునాయుడు, ప్రధాన కార్యదర్శి కె.రత్నరాజు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు తోట బాలకృష్ణ, అభయ్ కన్వీనర్ కేవీవీఎస్ శివకుమార్, రుద్రరాజు రమేష్‌రాజు, మోసుగంటి విజయకుమారి, మోసుగంటి లక్ష్మీప్రసన్న, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ ప్రసాద్, యలమంచిలి రమేష్ పాల్గొన్నారు.